మహిళలకు ఉచిత మగ్గం అల్లికల శిక్షణ ప్రారంభం

షాబాద్‌లో మహిళలకు మగ్గం అల్లికలపై శిక్షణ ఇస్తున్న బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్

షాబాద్, సెప్టెంబర్ 16: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉచిత మగ్గం అల్లికల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సహకారంతో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మగ్గం అల్లికల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలకు మగ్గం అల్లికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... షాబాద్‌లో ఈ నెల 16 నుంచి అక్టోబర్ 26 వరకు మహిళలకు మగ్గం అల్లికలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి రోజు కుమ్మరిగూడ, షాబాద్, సర్దార్‌నగర్, నరెడ్లగూడ, ముద్దెంగూడ, తదితర గ్రామాలకు సుమారు 50మందికి పైగా మహిళలు హాజరైనట్లు, మిగతా గ్రామాల మహిళలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ బి.సత్తయ్య, ట్రైనర్ సంధ్యారాణి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులపై వేటగాళ్ల పంజా..!

- కొరవడిన నిఘా.. రెచ్చిపోతున్న వేటగాళ్లు
- అడవి జంతువులపై కొనసాగుతున్న వేట..
- అంతరించిపోతున్న వన్యప్రాణులు
- పట్టించుకోని అడవి శాఖాధికారులు

నందివనపర్తిలో గాయపడిన జింకకు అందిస్తున్న చికిత్స.. మేడిపల్లిలో ఉచ్చులోపడిన నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు (ఫైల్)

యాచారం, సెప్టెంబర్ 16: వేటగాళ్ల దెబ్బకు వన్యప్రాణులు బలైపోతున్నవి. అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యం, నిఘా కరువవడంతో వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. నిత్యం ఇష్టారాజ్యంగా వన్యప్రాణులను వేటాడుతుండటంతో అవి క్రమంగా అంతరించిపోతున్నాయి. ఇప్పటికే వేటగాళ్ల వేటుకు కొన్ని జాతులు కనుమరుగైపోగా.. అనేక రకాల పక్షులు, జంతువులు బలైపోతున్నాయి.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పరిధిలో వేల ఎకరాల్లో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా యాచారం మండల పరిధిలోని గున్‌గల్, తాడిపర్తి, నల్లవెల్లి అటవీ ప్రాంతాలతో పాటు కొత్తపల్లి, మేడిపల్లి, కుర్మిద్ద, తమ్మలోనిగూడ గ్రామాల్లో గుట్టలతో కూడిన అటవీ ప్రాంతాలు ఉన్నాయి. మంచాల మండల పరిధిలోని జాపాల, ఆరుట్ల, లోయపల్లి, బోడకొండ, చెన్నారెడ్డిగూడ, ఆగపల్లి, నోముల గ్రామాల్లో, ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం, ముకునూరు, ఎలిమినేడు, నెర్రపల్లి తదితర ప్రాంతాల్లో సైతం అడవి ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవి ప్రాంతాల్లో దట్టమైన చెట్లు, పొదలు, గుట్టలు కలిగి ఉండటంతో అడవి జంతువులు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తాయి. అడవి పందులు, దుప్పులు, ఏదులు, ఆల్గా, ఉడుములు, కుందేళ్లతో పాటు నెమళ్లు, కుంజులు, పావురాలు, బురకలు, గువ్వ, గోరెంకలు లాంటి పక్షులు విస్తారంగా సంచరిస్తుంటాయి. అయితే.. వేటగాడి దెబ్బకు ఒకప్పుడు వేల సంఖ్యల్లో ఉన్న జంతువులు, పక్షులు అంతరించిపోయి వందల సంఖ్యలకే పరిమితమవుతున్నాయి.

అడవి జంతువులపై జోరుగా వేట..

అడవి ప్రాంతాల్లో నివసిస్తున్న అడవి జంతువులు, పక్షులపై జోరుగా వేట కొనసాగుతున్నది. వేటగాళ్లు రాత్రిపూట అడవి ప్రాంతంలో ఉచ్చులు బిగించి అడవి జంతువులను వేటాడుతున్నారు. అలాగే..కుందేళ్లు, ఏదులను సైతం ఉచ్చులతో బలిచేస్తున్నారు. అక్కడక్కడ జాతీయ పక్షిఅయిన నెమళ్లను సైతం వేటాడటం గమనార్హం. ఉడుములు, కుంజులు, నెమళ్లు, పావురాలు, బురకలు, గువ్వ పిట్టలు, గోరెంకలు, ఊర పిచ్చుకులు లాంటి పక్షలను సైతం వేటాడుతున్నారు. అయితే.. వేటాడిన అడవి జంతువులు, పక్షుల మాంసాలను బహిరంగగానే విక్రయిచడం గమనార్హం.

కొరవడిన నిఘా..

అడవి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా జంతువులు, పక్షులను వేటాడుతున్నా.. వారిపై చర్యలు తీసుకునేవారే కరువైపోయారు. అడవి సంపదతోపాటు అందులోని జంతువులు, పక్షులను రక్షించాల్సిన ఫారెస్టు అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారు. వారిపై నిఘా కొరవడటంతో ఇదే అదునుగా భావించిన వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఫారెస్టు అధికారులు అడవి ప్రాంతాల్లో తిరిగి.. వేటగాళ్లను అదుపులోకి తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తగ్గుతున్న వన్యప్రాణులు

అడవి ప్రాంతాల్లో సంచరిస్తున్న జంతువులు, పక్షులపై వేటగాళ్లు పంజా విసురుతుండటంతో వన్యప్రాణుల సంఖ్య రోజురోజుకూ క్రమంగా తగ్గుతోంది. ఇప్పటికే వేలాది జంతువులను వేటాడటంతో వాటి సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోతుంది. గతంలో గగన్‌గల్ ఫారెస్టులో జింకలు, దుప్పులు దర్శనమిచ్చేవి.. వేటగాళ్ల ప్రవేశంలో ప్రస్తుతం అవి కనిపించకుండా పోయాయి. అడవి పందుల సంఖ్య సైతం చాలా తగ్గిపోగా ఏదులు, ఆల్గలు, ఉడుములు సైతం అంతరించిపోతున్నాయి. ఇప్పటికే తోడేళ్లు, నక్కలు పూర్తిగా అంతరించిపోయాయి. పక్షులు సైతం అంతరించి పోతుండటంతో జీవకోటి మనుగడ సైతం భారంగా మారనుంది. జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో మాత్రం విఫలమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు వన్యప్రాణులను సంరక్షించే బాధ్యతను పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నది. ఇందుకు సంబంధించి రంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం జరిగే కార్యక్రమంలో ప్రజాపాలన దినోత్సవంపై ప్రసంగిస్తారు. కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శశాంక పర్యవేక్షించి.. ఎలాంటి పొరపాట్లు జరుగొద్దని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, డీఆర్వో సంగీత, కలెక్టరేట్ ఏవో సునీల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిగేల్‌మంటున్న వికారాబాద్ కలెక్టరేట్

వికారాబాద్ : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి వికారాబాద్ కలెక్టరేట్‌ను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. మంగళవారం జరిగే జాతీయ జెండావిష్కరణకు స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించనున్నారు.

విద్యుద్దీపాలతో జిగేల్‌మంటున్న వికారాబాద్ కలెక్టరేట్

ఢీకొట్టిన టిప్పర్.. పగిలిన మిషన్ భగీరథ చెక్‌వాల్

కొందుర్గు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ చెక్‌వాల్‌ను సోమవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొట్టడంతో భగీరథ పైపు పగిలింగి. నీళ్లు ఎగిసి పడుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు మూడు గంటలపాటు నీళ్లు వృథాగా పోయాయి. ఈ విషయాన్ని స్థానికులు సిబ్బందికి తెలుపగా నీటి సరఫరాను నిలిపివేశారు. పైపులోనుంచి నీళ్లు మొత్తం పోయాక మరమ్మతులు చేపట్టి.. నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సంబంధిత శాఖ సిబ్బంది తెలిపారు. అయితే.. పైపు పగిలిపోవడంవల్ల పలు ప్రాంతాలకు నీళ్లు సరఫరా ఉండదని, మరమ్మతులు పూర్తికాగానే సరఫరా చేస్తామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని మిషన్ భగీరథ పైపులైన్ నిర్వహన సిబ్బంది తెలిపారు.

– షాద్‌నగర్, సెప్టెంబర్ 16

ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షలో మహేందర్‌రెడ్డి, రాజూనాయక్

సాగు భూముల్లో ఫార్మా ఏర్పాటు తగదు

రైతుల దీక్షలో రైతుబంధు మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 16 : రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయవద్దని మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, దుద్యాల మండల బీఆర్ఎస్ నాయకుడు రాజూ నాయక్ అన్నారు. దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా హకీంపేట గ్రామ చౌరస్తాలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సోమవారం వారు మద్దతు తెలిపి కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం పట్టా భూములను సేకరిస్తే తరతరాలుగా భూములనే నమ్ముకుని జీవిస్తున్న రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఫార్మా ఏర్పాటుతో రైతుల బతుకులు ఆగమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం కంపెనీలను ఏర్పాటు చేయడం మంచిది కాదని.. ఇప్పటికైనా సీఎం స్పందించి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా రైతులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. బాధిత రైతులు దీక్షలో కూర్చుని తమ నిరసన వ్యక్తం చేశారు. దీక్షలో హకీంపేట మాజీ సర్పంచ్ మల్లికార్జున్, రైతులు కూర్చున్నారు.

దుద్యాలలోనే విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి

హకీంపేటలో వద్దంటూ ప్రజల నిరసన

దుద్యాలలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని నిరసన తెలుపుతున్న నాయకులు, యువకులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 16 : దుద్యాలలో కాకుండా హకీంపేట గ్రామానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం పట్ల దుద్యాల మండల కేంద్రానికి చెందిన ప్రజలు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విద్యా సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను దుద్యాలలోనే ఏర్పాటు చేయాలని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని సోమవారం దుద్యాల మండల కేంద్రంలో ని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో కాకుండా హకీంపేట గ్రామంలో వీటిని ఏర్పాటు చేయడం తగదని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలను దుద్యాలలోనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తాలూకా యూత్ అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నాయకులు బసిరెడ్డి, అహ్మద్‌పాషా, సీపీఎం నాయకుడు బుస్స చంద్రయ్య, రమేశ్, రాములు, నర్సింహులు గౌడ్, వెంకటయ్య, రవినాయక్, గోపాల్, అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరైన జాగ్రత్తలతోనే అధిక దిగుబడి..!

- పెరిగిన భూగర్భ జలాలు.. పెద్ద ఎత్తున వరిపంట సాగు
- భూసార పరీక్షల ఫలితాల కనుగుణంగానే ఎరువులు ..
- సొంత నిర్ణయాలు వద్దు.. అధికారుల సూచనలు తప్పనిసరి
- సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట దిగుబడి

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 16 : భారీ వర్షాలు పడటంతో భూగర్భజలాలు పెరిగి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున వరిపంటను సాగుచేస్తున్నారు. అయితే రైతులు ఇష్టానుసారంగా ఎరువులు వాడకుండా సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఎరువుల వాడకంపై ఎప్పటికప్పుడు తమ సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ఫలితాలకనుగుణంగా ఎరువులను వాడినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. భూసార పరీక్షలు చేయించి ఎకరానికి 25నుంచి 32కిలోల నత్రజని, 16కిలోల భాస్వరం, 12నుంచి 16కిలోల పొటాష్ లభించే ఎరువులను మాత్రమే వాడాలి. అంతకుమించి వాడితే వరికి తెగుళ్లు వచ్చే ప్రమాదమున్నందని, అధికారుల సూచనల మేరకే పంటలకు మందులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు.

మూడు విడతలుగా చల్లాలి..

వరిపైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతోంది. నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలోగానీ, యూరియా రూపంలోగానీ వాడొచ్చు. దీనిని మూడు దఫాలుగా పొలంలో చల్లుకోవాలి. నాటు వేసేముందు, దుబ్బు చేసే దశలో, అంకురం ఏర్పడే దశలో నత్రజనిని అందించే ఎరువులను వాడు కోవాలి. నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో అందించేందుకు యూరియా వాడే విధానంపై రైతులు దృష్టి సారించాలి. ఎకరానికి 25నుంచి 32కిలోల నత్రజని అందిచాలంటే 55నుంచి 70కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమానభాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన స్థాయిలో లేకుండా అదనంగా 10నుంచి 15కిలోల వరకు యూరియా వాడొచ్చు. లేదంటే 50కిలోల యూరియాకి 10కిలోల వేపపిండి లేక 250కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది. యూరియా అధిక వినియోగంతో అనేక అనర్థాలు ఎదురవుతాయి.

సకాలంలో భాస్వరం..

మొక్కల వేర్ల పెరుగుదలకు పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాటువేసే ముందు దమ్ములో, నాట్లు వేసిన 15రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను పై పాటుగా వేయరాదు. నత్రజని ఎరువుల బురద పదనులోవేసిన తర్వాత నీరు పెట్టాలి. యూరియా చల్లిన 48గంటల తర్వాత తప్పనిసరిగా పంటకు నీటిని అందజేయాలి.

జింకు లోపం..

సాధారణంగా జింకులోపం చలికాలం, చౌడు పొలాల్లో, మురుగు సమస్య ఉండే పంటచేళ్లలోనూ కనిపిస్తుంది. వరినాటిన 2 నుంచి 4 వారాల్లో జింకు లోపం కనిపిస్తుంది. ముదురాకు చివర తుప్పు మచ్చలు ఏర్పడి, ఆకులు పెలుసుగా తయారవుతాయి. జింకు లోపం నివారణకు 20కిలోల జింకు సల్ఫేటు, ఎకరానికి చివరి దమ్ములో వేయాలి. లేకపోతే 0.2శాతం జింకు సల్ఫేటును, నాలుగైదు రోజులకొక్కసారి రెండు, మూడు పర్యాయాలు పైరు ఆకులు తడిచేటట్లు పిచికారి చేయాలి. జింకు సల్ఫేటును ఎలాంటి పురుగు, తెగుళ్ల మందులతో కలిపి పిచికారి చేయొద్దు. జింకు సల్ఫేటు పిచికారి చేసిన తర్వాత 25-30కిలోల యూరియా ఎకరానికి పై పాటుగా వేయాలి.

వరిలో సరైన జాగ్రత్తలు పాటించాలి

రైతులు ప్రతి రోజూ వ్యవసాయ పొలాని కెళ్లి పంట పరిస్థితిని పరిశీలించాలి. అనుమానం వచ్చిన వెంటనే స్థానికంగా వ్యవసాయ రైతు వేదికల్లో ఉండే అధికారులను సంప్రదించి.. వారి సలహాలు, సూచనలతో మందులను వాడి సమస్యను పరిష్కరించుకోవాలి. వరిలో ఇనుము లోపం కూడా రావచ్చు. నివారణకు 20-30గ్రాముల అన్నభేది చూర్ణము, లేక మూడు గ్రాముల నిమ్మఉప్పు, లీటరు నీటిలో కలిపి పైరు బాగా తడిచేలా పిచికారి చేయాలి. రైతులు ఎప్పుడు కూడా సొంత నిర్ణయాలుతీసుకోకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

– శ్రావణ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి, ఇబ్రహీంపట్నం

ఐరన్ లోడ్ లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

తారామతిపేట వద్ద ఓఆర్ఆర్‌పై ప్రమాదం

అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై పడిన లారీ

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 16: ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని తారామతిపేట పరిధి లో ఓఆర్ఆర్‌పై సోమవారం తెల్లవారుజామున జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ సత్యసాయి అనంతపురం జిల్లా హిందూపురం మోడల్ కాలనీకి చెందిన డ్రైవర్ రాజగోపాల్‌చారి (28) ఐరన్ లోడు లారీతో రాయిపూర్ నుంచి బెంగళూరుకు ఓఆర్ఆర్‌పై వెళ్తున్నాడు. తెల్లవారుజామున తారామతిపేట వద్ద ఓఆర్ఆర్ 10వ ఎగ్జిట్ సమీపంలో టోల్ గేట్ దాటగానే లారీ అదుపుతప్పి ఓఆర్ఆర్ పైనుంచి కింద సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్ రాజగోపాల్‌చారి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ బాబాజాన్ తీవ్రంగా గాయపడ్డాడు.

వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాయపడ్డ బాబాజాన్‌ను దవాఖానకు తరలించారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రాజగోపాల్‌చారి మృతదేహాన్ని గ్యాస్ కట్టర్ సాయంతో బయటకుతీశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఈ రోడ్డుపై ప్రయాణమెట్లా?

మొయినాబాద్‌లోని పెద్దమంగళారం నుంచి అనుబంధ గ్రామమైన అమీర్‌గూడ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లతో ఇతర వాహనాలు అందులోనే ఇరుక్కుపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– మొయినాబాద్, సెప్టెంబర్16

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పర్సాపూర్ పల్లె ప్రకృతివనం

నేడు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న దృశ్యం

పల్లె ప్రకృతి వనాల్లో పచ్చదనం ఎక్కడ..!

కొడంగల్, సెప్టెంబర్ 16 : గత సంవత్సరానికి ముందు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పచ్చటి శోభతో విరాజిల్లేవని.. అయితే.. నేడు అవి ఆదరణ కురువై మోడుబోతున్నాయి. గత కేసీఆర్ హయాంలో ప్రతి గ్రామంలోనూ ప్రకృతి అందాలు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి.. వివిధ రకాల మొక్కలు నాటడంతో పాటు చిన్నారులు ఆడుకోవడానికి ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. వీటికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి మొక్కలను సంరక్షించి, పచ్చటి వాతావరణాన్ని గ్రామాలకు అదించారు. అయితే నేడు వాటిని పట్టించుకోకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. అలాగే.. పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందిం చి పల్లెప్రకృతి వనాల్లోని చెట్లను కాపాడి, గ్రామస్తులకు పచ్చటి వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.